క్లుప్తంగా

ఉత్తమ ఇంజనీర్‌గా సూరత్తు తేజ



ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): సివిల్ ఇంజనీరింగ్ రంగంలో అత్యుత్తమ ప్రతిభ చూపుతున్న ఔత్సాహిక ఇంజనీర్లను ప్రోత్సహించేందుకు ది హిందూ సంస్థ 8 విభాగాల్లో ఉత్తమ ఇంజనీర్లకు అవార్డులను ప్రకటించింది. దీనిలో ఒకటైన రిపేర్స్ అండ్ రీభ్యాబిలిటేషన్ కేటగిరీలో నగరానికి చెందిన యువ ఇంజనీర్ సూరత్తు తేజ అవార్డుకు ఎంపికయ్యారు. ఈ అవార్డును ఈ నెల 15న తిరుపతిలోని పద్మావతి కళాశాలలో నిర్వహించే కార్యక్రమంలో రామ్ కో సిమెంట్ సంస్థ ఆధ్వర్యంలో అతిథుల ద్వారా అందజేయనున్నారు. అవార్డుకు ఎంపికైన తేజను నగరానికి చెందిన పలువురు ఇంజనీర్లు, ఇంజనీరింగ్ సంస్థలు, ప్రజాప్రతినిధులు అభినందించారు.

భక్తి శ్రద్ధలతో లక్ష్మీ కుబేర వ్రతాలు



కరెన్సీ అలంకరణలో సత్రంపాడు శ్రీలక్ష్మీ గణపతి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక సత్రంపాడు శ్రీలక్ష్మీ గణపతి ఆలయంలో నిర్వహిస్తున్న గణపతి నవరాత్రి ఉత్సవంలో భాగంగా శుక్రవారం దేవదాయ ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో మహిళలతో ఉచిత సామూహిక గోపూజ, లక్ష్మీ కుబేర వ్రతాలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. స్వామి వారికి కరెన్సీతో ప్రత్యేక అలంకరణ చేశారు. ఈ పూజల్లో పాల్గొన్న వారందరికీ అన్నపనేని రవి కుమార్ దంపతులు చీరలు పంపిణీ చేశారు. భక్తులకు దేవస్థానం తరఫున గాజులు, రవిక ముక్క, లక్ష్మీ కుబేర యంత్రం పంపిణీ చేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి సీహెచ్ చిన నాగేశ్వర రావు పర్యవేక్షించారు.

ముగిసిన బాల గణేశుని పూజలు

స్థానిక ఆదివారపు పేట శ్రీ షిరిడి సాయి ప్రేమ మందిరం సేవకులు, ఆలయ అధ్యక్షుడు ఇసుకపల్లి తాతారావు సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ లక్ష్మీ గణపతి మహోత్సవాలు గురువారంతో ముగిశాయి. 11 కేజీల లడ్డూను వేలం వేయగా తుంపాల సత్యనారాయణ రూ. 8 వేలకు దక్కించుకున్నారు. 5 కేజీల లడ్డూను కర్రా ప్రభాకర్ రావు దక్కించుకున్నారని అర్చకులు గంగాధర్ తెలిపారు. అనంతరం భక్తులు బాబాను పల్లకిలో నగర వీధుల్లో మేళ తాళాలతో సంకీర్తనలతో భక్తిశ్రద్ధలతో ఊరేగింపు నిర్వహించారు.

ముంపు గ్రామాల్లో త్వరలో ఉపాధి శిక్షణ కేంద్రం



జేసీ పి.ధాత్రి రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న పెరికె వరప్రసాదరావు

ఏలూరు (టూటౌన్): పోలవరం ముంపు గ్రామాల్లో సెయింట్ జాన్ వెల్ఫేర్ సొసైటీ ద్వారా డ్రైవింగ్, స్కూల్ బ్యాగ్స్ మేకింగ్‌లలో శిక్షణ కేంద్రం ప్రారంభించేందుకు అనుమతి ఇవ్వాలని సొసైటీ అధ్యక్షుడు పెరికె వరప్రసాదరావు జాయింట్ కలెక్టర్ పి.ధాత్రి రెడ్డిని కోరారు. స్థానిక జేసీ ఛాంబర్‌లో గురువారం మర్యాదపూర్వకంగా కలిసిన పెరికె వరప్రసాదరావు పూలమొక్కను అందజేశారు.ఈ సందర్భంగా ఆయన ముంపు గ్రామాల్లో శిక్షణకు అనుమతి ఇవ్వాలని కోరారు. దీనిపై జేసీ సానుకూలంగా స్పందించారని త్వరలో పోలవరం ముంపు గ్రామాల్లో డ్రైవింగ్ స్కూల్, జ్యూట్ బ్యాగ్‌ల తయారీ శిక్షణ ప్రారంభిస్తామని వరప్రసాదరావు తెలిపారు.

నేడు ఉచిత క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నగరంలోని ఆఫీసర్స్ క్లబ్ సహకారంతో జీఎస్‌ఎల్ ట్రస్ట్ క్యాన్సర్ సెంటర్ ప్రతినిధులు ఏలూరు హేలాపురి రూరల్, ఏలూరు దుర్గాతేజ లయన్స్ క్లబ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో శనివారం ఉచిత క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు, అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు లయన్స్ జిల్లా గవర్నర్ కాకరాల వేణుబాబు తెలిపారు. స్థానిక ఇండోర్ స్టేడియం దగ్గరలోని ఆఫీసర్స్ క్లబ్‌లో శనివారం ఉదయం 9 గంటలకు ఈ శిబిరాన్ని ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి ప్రారంభిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొంటారని తెలిపారు. ఈ శిబిరంలో అత్యధిక మంది పాల్గొని క్యాన్సర్‌పై అవగాహన పెంచుకోవాలని, క్యాన్సర్ వ్యాధిని ముందుగా గుర్తిస్తే ప్రాణాపాయం నుంచి బయటపడే అవకాశం ఉంటుందని తెలిపారు.

ప్రభుత్వానికి వైద్యుల సమ్మె సెగ

- జీవో 85 రద్దు చేయాలని కోరుతున్న వైద్యులు
- ఈ నెల 10 నుంచి సమ్మెబాట

దెందులూరు: వైద్యులు జీవో 85కు వ్యతిరేకంగా సమ్మె సైరన్ మోగించారు. ఆంధ్రప్రదేశ్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు ఆందోళన తీవ్రతరం చేశారు. జీవో 85 వైద్యులకు తీవ్ర అన్యాయం కలిగిస్తుందంటూ వారు 10వ తేదీ నుంచి సమ్మె చేస్తున్నారు. వైద్యుల మూడేళ్ల సర్వీస్‌కు అర్థం లేకుండా జీవో 85 ప్రభుత్వం ఇవ్వడం అన్యాయమని వైద్యవృత్తి ప్రగతికి నష్టమని వైద్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు నెలలకు జీవో 85ను రద్దు చేయమని ఎమ్మెల్యేలు, మంత్రులు, ఉన్నతాధికారులకు వైద్యులు, వైద్య సంఘాలు అర్జీలు సమర్పించారు. తమగోడు పట్టించుకునే నాథుడు ఒక్కరూ కూడా లేకపోవడం, ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందన లేకపోవడంతో సమ్మె ప్రారంభించక తప్పలేదని వైద్యులు చెబుతున్నారు. జీవో 85 ద్వారా పోస్టుగాడ్యుయేట్ అవకాశాలు తగ్గించడం అన్యాయమన్నారు. ఈ విధానం గిరిజన, గ్రామీణ ప్రాంతాల్లో సేవలకు ప్రభావితం చేస్తుందన్నారు.



దెందులూరు సీహెచ్‌సీ

దశల వారీగా వైద్యుల ఆందోళన కార్యక్రమాలు

- 13న ప్రభుత్వం చర్చలకు ఆహ్వానిస్తే పీహెచ్‌సీ వైద్యులు అత్యవసర సర్వీసులను మినహాయించి అన్ని రిపోర్టింగ్‌లు వీసీ,టీసీ, అధికారిక కమ్యూనికేషన్లు నిలిపివేస్తారు.
- 14న పీహెచ్‌సీ సేవలు కేవలం అత్యవసర వైద్య సేవలు మాత్రమే చేస్తారు
- 15న చలో విజయవాడ, డైరెక్టర్ ఆఫ్ హెల్త్ కార్యాలయం వద్ద
- 16 నుంచి నిరవధిక నిరాహార దీక్షలను ప్రారంభిస్తారు.

జీవో 85 రద్దు చేయాలి



ప్రభుత్వం జీవో 85ను రద్దు చేయాలి. దీనిపై వైద్యుల వ్యతిరేకతను తెలియజేస్తూ నిరసనలు తెలిపి, అధికారులకు అర్జీలు అందించాం. జీవో 85 రద్దుపై ప్రభుత్వం ఇంకా స్పందించలేదు. వైద్యులకు నష్టం కలిగించే విధానాలను పాలకులు విడనాడాలి.

– డాక్టర్ పవన్, దెందులూరు

వైద్యుల సమస్యలు పరిష్కరించాలి



వైద్యుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలి. నీట్ పీజీ కౌన్సెలింగ్ నోటిఫికేషన్ తరువాత వైద్యులు యథావిధిగా విధులు కొనసాగడం సాధ్యంకాని పరిస్థితుల్లో సమ్మెకు దిగవల్సిన పరిస్థితి ఏర్పడింది. వైద్యుల భవిష్యత్తును, అభివృద్ధిని పరిగణనలోనికి తీసుకోవాలి.

– డాక్టర్ ప్రసాద్ నాయక్, దెందులూరు

విజయావకాశాలు తగ్గించడం అన్యాయం



ప్రభుత్వం జీవో 85 ద్వారా వైద్యుల విజయావకాశాలు తగ్గించడం అన్యాయం. వైద్యులు గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో సేవలను ప్రభావితం చేస్తుంది. వైద్యులకు అభివృద్ధి, భవిష్యత్తు లేకుండా చేయడం సరైన విధానం కాదు. ప్రభుత్వం వెంటనే స్పందించాలి.

– డాక్టర్ ప్రవీణ్, పోతునూరు

మానవతా దృక్పథంతో స్పందించాలి



ఈ జీవో వల్ల మూడేళ్ల సర్వీసుకు అర్థం లేకపోయింది. ప్రభుత్వం ఈ జీవోను ఇవ్వడం ఆశ్చర్యానికి గురిచేసింది. రెండు నెలలుగా జీవో రద్దు చేయమని కోరుతున్నాం. మానవతా దృక్పథంతో ప్రభుత్వం స్పందించాలి.

– డాక్టర్ చైతన్య, పోతునూరు

నైపుణ్యాభివృద్ధిపై దృష్టి సారించాలి

ఉంగుటూరు: పరిశ్రమలకు, ఉద్యోగార్థులకు కళాశాల బ్రిడ్జి లాంటిదని, విద్యార్థులు నైపుణ్యాభివృద్ధిపై దృష్టి సారించాలని ప్లేస్‌మెంటు అండ్ ట్రైనింగు ప్రోగ్రామ్ ఆఫీసరు కావూరి శ్రీధర్ అన్నారు. శుక్రవారం నారాయణపురం ఎస్‌ఏఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎంప్లాయిబిలిటీ స్కిల్స్ అండ్ ఇంటర్వ్యూ మెళకువలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ ఉద్యోగాల ఎంపికకు అవసరమైన మెళకువలను, నూతన విధానాలను, నైపుణ్యాలను విద్యార్థులకు వివరించారు. టెక్నికల్ స్కిల్స్, సాఫ్ట్ స్కిల్స్, అకాడమిక్ స్కిల్స్ తదితర అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు రెడ్డియ్య, కొండారవి, పి.బాబూరావు పాల్గొన్నారు.

ఏచూరి మృతి ప్రజా ఉద్యమాలకు తీరనిలోటు

పెదపాడు: సీపీఎం పెదపాడు శాఖ ఆధ్వర్యంలో సీపీఎం అఖిల భారత ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి సంతాప సభ శుక్రవారం పెదపాడులోని నర్రా ఆంజనేయులు భవనంలో నిర్వహించారు. ముందుగా సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇటీవల సీపీఎం నాయకులు మాజీ ఎమ్మెల్యే రుద్రరాజు సత్యన్నారాయణ రాజు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా జోహార్లు అర్పించారు. అనంతరం సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు కే శ్రీనివాస్ అధ్యక్షతన సంతాప సభ నిర్వహించారు. సీతారాం ఏచూరి మృతి కార్మిక, రైతాంగ, ప్రజా ఉద్యమాలకు తీరని లోటని చెప్పారు. సీపీఎం నాయకులు కరీముల్లా, గుండపనేని సురేష్, పీ రాహేల్, రెడ్డి లక్ష్మణరావు నీలపాల వెంకటేశ్వరరావు ఎం కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థి ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

భీమడోలు: నేటి బాలలే రేపటి భావి భారత పౌరులని, ప్రతి విద్యార్థి ఇష్టంతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని తాడేపల్లిగూడెం ఆర్టీసీ డిపో మేనేజర్ వై.సత్యనారాయణమూర్తి అన్నారు. పూళ్ల ఉన్నత పాఠశాలకు చెందిన 150 విద్యార్థినీ విద్యార్థులకు వైఎస్సార్‌సీపీ నేత, డీసీసీబీ మాజీ డైరెక్టర్ కందులపాటి శ్రీనివాస్ ఆర్థిక సాయంతో శుక్రవారం ఉచిత బస్ పాసుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల హెచ్‌ఎం పి.భువనేశ్వరరావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా డిపో మేనేజర్ వై.సత్యనారాయణమూర్తి, వైఎస్సార్‌సీపీ నేత కందులపాటి శ్రీనివాస్ హాజరయ్యారు. వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఉన్నతచదువులు చదువుకుని ఉన్నత విద్యను అభ్యసించి సమాజ అభ్యున్నతికి పాటు పడాలన్నారు. అనంతరం దాత కందులపాటి శ్రీనివాస్‌ను దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ దాయం సుజాత, ఎస్‌ఎంసీ చైర్మన్ కె.రామలక్ష్మి, సభ్యుడు ఎం.ప్రసాద్, పీఆర్వో దొంతల విజయకుమార్, టీచర్ గంగరాజు, ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.



పూళ్లలో విద్యార్థులకు బస్‌పాసులు అందించిన డీఎం వై.సత్యనారాయణమూర్తి, శ్రీనివాస్

వరద బాధితులను ఆదుకోవాలి

భీమడోలు: విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు ప్రతి ఒక్కరూ మానవత్వాన్ని చాటాలని శ్రీగాయత్రీ జిల్లా బ్రాహ్మణ సేవా సమితి ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా శాఖ అధ్యక్షుడు తోలేటి శ్రీనివాస్ అన్నారు. ఉమ్మడి జిల్లాల శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం విజయవాడలోని వరద బాధితులకు సహాయార్థం నిత్యావసర సరుకులు, బియ్యం, దుప్పట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. విజయవాడ వెళ్తున్న వాహనాన్ని భీమడోలులో జిల్లా అధ్యక్షుడు టి.శ్రీనివాస్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విజయవాడలోని వరద బాధితుల ఆకలి కేకలు మానవతా మూర్తులను కలిచి వేస్తున్నాయన్నారు. ప్రతి ఒక్కరూ తమకు ఉన్నంతలో ఇతరులకు ఉపకారం చేయాలన్నారు. అనంతరం బ్రాహ్మణ సంఘం పెద్దలు, యువకులు విజయవాడ వెళ్లి ఇంటింటికీ సరుకులు, దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కాశీబొట్ల పార్వతీశ్వర శర్మ, కోశాధికారి అమ్మనమంచి మురళీకృష్ణ, వ్యవస్థాపక అధ్యక్షుడు బుద్ధవరపు సుబ్బారావు, ఉపాధ్యక్షుడు పెనుమాక వాసుదేవరావు, ప్రతినిధులు అగ్నిహోత్రం నారాయణాచార్యులు, కాశీబొట్ల సత్యేంద్రకుమార్, వి.ప్రభాకరం, కనకదుర్గ, పెద్దలు గన్ని భరత్, పత్తి మదన్, తాటిమళ్ల రామ్మూర్తి, సత్యకృష్ణ, లీలాకృష్ణ పాల్గొన్నారు.



భీమడోలులో నిత్యావసరాలను తరలించే వాహనాన్ని ప్రారంభిస్తున్న తోలేటి శ్రీనివాస్

విద్యాదాత మొటపర్తి రామచంద్రమ్మ మృతి

దెందులూరు: విద్యావేత్త, దెందులూరులో రూ.4 కోట్లతో విద్యా సంస్థలు, నర్సింగ్ కళాశాల, డీఈడీ కళాశాల, కమ్యూనిటీహాళ్లు, టీటీడీ కల్యాణ మండపం, మీసేవ, అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, దేవాలయాలు, గ్రంథాలయం, వైద్యశాల, ఆర్వో ప్లాంట్‌కు స్థలాలు, భవనాలు నిర్మించిన దాత మొటపర్తి రామచంద్రమ్మ హైదరాబాద్‌లో మృతి చెందారు. ఆమెకు కుమారుడు మొటపర్తి వెంకట్, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. గ్రామానికి రూ. 4 కోట్లకుపైగా నిధులు వెచ్చించి స్థలాలు, భవనాలు అందివ్వడమే కాకుండా ఇటీవల రూ.2 కోట్లకుపైగా విలువైన ఆమె ఇంటిని ప్రభుత్వ బాలసదనానికి అందించిన గొప్పదాత అని గ్రామస్తులు, అధికారులు కొనియాడారు. శుక్రవారం దెందులూరు ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు శ్రీదేవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దెందులూరు నర్సింగ్ కళాశాలలో కరస్పాండెంట్ సుగ్గిశెట్టి నూకరాజు, విద్యార్థులు ఆమె చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు.




దెందులూరు బాలికల ఉన్నత పాఠశాలలో దాత చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

దాత రామచంద్రమ్మకు ఘన నివాళి

దెందులూరు: కోట్లాది రూపాయల విలువ గల భవనాన్ని స్త్రీ శిశు సంక్షేమ శాఖ బాలసదనానికి దానంగా ఇచ్చిన దాత మొటపర్తి రామచంద్రమ్మ మరణం తమకు తీరనిలోటని బాలసదనం సూపరింటెండెంట్ బేబి సరోజిని అన్నారు. శుక్రవారం దాత ఇచ్చిన నివాసంలో ఉన్న బాలసదనం చిన్నారులతో కలిసి సూపరింటెండెంట్, సిబ్బంది, చిన్నారులు ఆమె చిత్రపటానికి పూలమాలలువేసి మౌనంపాటించారు.

నారాయణపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు బీ ప్లస్ గుర్తింపు

ఉంగుటూరు: నారాయణపురం అరవింద శతజయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు నేక్ గుర్తింపు లభించింది. ఇప్పుడున్న బీ స్థానంలో బీ ప్లస్ గుర్తింపు నిచ్చింది. దాంతో కళాశాల అభివృద్ధి కమిటీ సభ్యులు, అధ్యాపకులు శుక్రవారం సమావేశమయ్యారు. కళాశాలకు మెరుగైన గుర్తింపు రావడం ఎంతో ఆనందాన్నిచ్చిందని ప్రిన్సిపాల్ విశ్వేశ్వర రావు తెలిపారు. దీని వెనుక పూర్వ విద్యార్థులు, అభివృద్ధి కమిటీ సభ్యుల పాత్ర ఎంతో ఉందన్నారు. ఈ సమావేశంలో పూర్వ విద్యార్థి సంఘం నాయకులు ఈపూరి సత్యనారాయణ, శ్రీనివాస రాజు, బొమ్మిడి అప్పారావు, జానికి రామరాజు, ఆదిరెడ్డి సత్యనారాయణ, వైఆర్‌కే బాబ్జి, తదితరులు హాజరై వారి ఆనందాన్ని వ్యక్తం చేశారు. పెద్దలు దాతృత్వం మరవలేనిదని వారన్నారు.



నారాయణపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కలిసిన పూర్వవిద్యార్థులు, అధ్యాపకులు

ప్రతి విషయంపై లోతైన అవగాహన అవసరం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): సాధారణంగా లభించే జ్ఞానం కన్నా ఒక విషయంపై లోతైన అవగాహన కలిగించడమే నాలెడ్జ్ ఎక్స్‌టెన్షన్ ప్రోగ్రాం ఉద్దేశ్యం అని సెయింట్ థెరిసా మహిళా స్వయంప్రతిపత్తి కళాశాల ఫిజిక్స్ అండ్ ఎలక్ట్రానిక్స్ విభాగాధిపతి నిర్మల జ్యోత్స్న తెలిపారు. స్థానిక సెయింట్ థెరిస్సా మహిళా కళాశాలలో బీఎస్సీ మూడవ సంవత్సరం ఫిజిక్స్ విద్యార్థినులు శుక్రవారం నిర్వహించిన నాలెడ్జ్ ఎక్స్‌టెన్షన్ ప్రోగ్రాంలో ఆమె పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కళాశాలలో పదేళ్లుగా ఈ విధమైన కార్యక్రమాలు నడుస్తున్నాయని తెలిపారు. విద్యార్థినులు ఆధునిక జీవితంలో వివిధ రకాలైన పరికరాలకు ఉపయోగించే సెన్సార్లపై అవగాహన కార్యక్రమం నిర్వహించామన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన వివిధ రకాలైన సెన్సార్లు, వాటి ఆపరేటింగ్ సిస్టంలు అందరినీ అలరించాయి. నిర్వాహకులను ప్రిన్సిపల్ సిస్టర్ మెర్సీ, వైస్ ప్రిన్సిపల్ మరియ క్రిస్టియ, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ సిస్టర్ సుశీల ఇతర అధ్యాపకులు అభినందించారు.

17 నుంచి నులిపురుగుల నిర్మూలన దినోత్సవం

దెందులూరు: కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలో ఈ నెల 17వ తేదిన నులిపురుగుల నిర్మూలన దినోత్సవం నిర్వహించనున్నామని దెందులూరు తహసీల్దార్ బి.సుమతి అన్నారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల సిబ్బంది చురుగ్గా పాల్గొని నులిపురుగుల నివారణా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఇప్పటికే సీహెచ్‌సీ, పీహెచ్‌సీలకు వైద్య ఆరోగ్యశాఖ ద్వారా కరపత్రాలు, బ్రోచర్లు సరఫరా చేశామన్నారు.

అశోక్ శ్రీనివాస్ మరణం తీరనిలోటు

దెందులూరు: చింతలపూడి మాజీ ఏఎంసీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత మేడవరపు అశోక్ శ్రీనివాస్ ఆకస్మిక మరణం బాధాకరమని జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాద్ అన్నారు. శుక్రవారం తడికలపూడి మండలం కళ్లచెరువులో ఆయన నివాసంలో అశోక్ పార్థివదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన సతీమణి విజయలక్ష్మి, కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధం

గణపవరం: ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధమని, రాజ్యాంగానికి తూట్లు పొడిచేలా ఎస్సీలను ఏబీసీడీలుగా వర్గీకరిస్తే ఉద్యమం తప్పదని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు హెచ్చరించారు. గణపవరం మండలం పిప్పరలో మెంటయ్య అధ్యక్షతన నిర్వహించిన మాలమహానాడు మండల సమావేశంలో మంగరాజు మాట్లాడారు. మాల సంఘాలు రిజర్వేషన్ వర్గీకరణకు వ్యతిరేకంగా నిరసన ప్రదర్శనలు చేపట్టనున్నట్టు చెప్పారు. మాలమహానాడు నాయకులు సోడదాసి జైపాల్, బి.శివరావు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

ఉంగుటూరు: ఉంగుటూరు సెంటర్లో మోటారు సైకిల్ ఢీకొన్న ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న వెంకమ్మ అనే వృద్ధురాలు మృతి చెందింది. ఈనెల 3న ఉంగుటూరు సెంటర్లో వెంకమ్మను మోటారుసైకిల్ ఢీకొట్టింది. తీవ్ర గాయాలైన ఆమెను తాడేపల్లిగూడెం, ఆ తరువాత ఏలూరు ఆసుపత్రులకు తరలించారు. పరిస్థితి విషమంగా మారడంతో రాజమండ్రిలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆమె గురువారం రాత్రి మృతి చెందింది. చేబ్రోలు పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా వినాయకచవితి ఉత్సవాలు



సీతంపేటలో వినాయకుడిని పూజిస్తున్న భక్తులు

దెందులూరు: వినాయకచవితి ఉత్సవాలు, నిమజ్జనాలు, ర్యాలీ, ఊరేగింపులు ఘనంగా కొనసాగుతున్నాయి. సీతంపేటలో స్వామివారికి ఉత్సవాల నిర్వాహకులు, యువత ప్రత్యేకాలంకరణ, పూజలు చేశారు. దెందులూరు, చల్లచింతలపూడి, కొవ్వలి, పోతునూరు, దోసపాడు, సోమవరప్పాడు, గోపన్నపాలెంలో ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. గోపన్నపాలెంలో వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా శ్రీవల్లి ప్రమోటర్స్ అధినేత కొండేటి మనోహర్ బాల గణేష్ ఉత్సవ కమిటీ, స్వామివారికి రూ.7 వేలు విరాళం అందించారు. బాల గణేష్ ఉత్సవ కమిటీ సత్కరించి స్వామివారి జ్ఞాపికను అందజేశారు.

ఘనంగా మన్మహా గణపతి ఉత్సవాలు

భీమడోలు: శ్రీమన్మహా గణపతి ఉత్సవాలు భీమడోలులోని వైభవంగా కొనసాగుతున్నాయి. 60వ మన్మహా గణపతి ఉత్సవాల్లో భాగంగా ఏడో రోజైన శుక్రవారం స్వామి వారు కుంకుమ వర్ణంలో భక్తులకు దర్శనమిచ్చారు. పరిసర గ్రామాల నుంచి వచ్చిన భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయంలో గణపతి హోమం వైభవంగా నిర్వహించారు. పలువురు భక్తులు, దంపతులు పాల్గొన్నారు.



భీమడోలులో కుంకుమవర్ణంలో శ్రీమన్మహాగణనాథుడు

సమాజాభివృద్ధికి కృషి అభినందనీయం

ఏలూరు (టూటౌన్): సుదీర్ఘంగా దివ్యాంగుల కొరకు పనిచేయడం అభినందనీయమని విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు బి.రామ్‌కుమార్ అన్నారు. స్థానిక దొండపాడులోని ఉమా ఎడ్యుకేషనల్ అండ్ టెక్నికల్ సొసైటీ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమాన్ని జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రం, ప్రత్యేక డీఎడ్ అండ్ బీఎడ్ కాలేజీలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ఏడీ రామ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా కేక్ కట్ చేసి సొసైటీ వ్యవస్థాపకుడు ఎస్వీ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 1988 సెప్టెంబర్ 13న కాకినాడలో మానసిక దివ్యాంగుల కోసం పాఠశాలను స్థాపించి సుదీర్ఘ కాలంగా దివ్యాంగుల కోసం సమాజ అభివృద్ధి కోసం నిరంతరం పనిచేయడం గొప్ప విషయమన్నారు. రెండు వందలకు పైగా సిబ్బంది, వేల మంది దివ్యాంగులకు సేవలందించిన సొసైటీ అవసరమైన వారికి కృత్రిమ అవయవాలు, హియరింగ్ ఎయిడ్స్, ట్రై సైకిల్, చక్రాల కుర్చీలు అందించిందన్నారు. 2003లో అప్పటి రాష్ట్రపతి అబ్దుల్ కలాం, 2019లో రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ చేతుల మీదుగా అవార్డులు అందుకోవడం గర్వకారణమన్నారు. దీనితో పాటు ఐదు సార్లు జాతీయ అవార్డులు పొందడం విశేషమన్నారు. సంస్థ కో-ఆర్డినేటర్ డి.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఉమా ఎడ్యుకేషనల్ అండ్ టెక్నికల్ సొసైటీ సంస్థ 14 రకాల ప్రాజెక్టుల ద్వారా దివ్యాంగులకు అనేక రకాల సేవలందిస్తోందన్నారు. ఏలూరులో ప్రత్యేక డీఎడ్ కాలేజీ ద్వారా దివ్యాంగులకు ప్రత్యేక విద్యను బోధించడానికి ప్రత్యేక ఉపాధ్యాయులకు శిక్షణనిస్తున్నామన్నారు. జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రం ద్వారా దివ్యాంగులకు కృత్రిమ అవయవాలు, ఉపకరణాలు అందిస్తున్నట్టు తెలిపారు. ప్రత్యేక డీఎడ్ కాలేజీ సిబ్బంది, డీడీఆర్‌సీ సిబ్బంది, డీఎడ్ అండ్ బీఎడ్ కాలేజీ విద్యార్థులు పాల్గొన్నారు.



దివ్యాంగులతో కలిసి కేక్ కట్ చేస్తున్న ఏడీ రామ్‌కుమార్

పోషకాహారంతో రక్తహీనత నివారణ

ఏలూరు (టూటౌన్): పోషకాహారంతో రక్తహీనతకు చెక్ పెట్టవచ్చునని ఐసీడీఎస్ ఏలూరు ప్రాజెక్టు సీడీపీఓ ఏ.పద్మావతి తెలిపారు. వెంకటాపురం 5,13,14,15,16 అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో పౌష్టికాహార మాసోత్సవ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఈడీసీఓ పద్మావతి హాజరయ్యారు. ఈ సందర్భంగా పౌష్టికాహారం ఆవశ్యకతను వివరించారు. కిషోర బాలికలు, గర్భిణులు, బాలింతలు, తల్లులు రక్తహీనతకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ప్రతి ఒక్కరూ అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పౌష్టికాహారాన్ని తప్పనిసరిగా తీసుకోవాలని కోరారు. అనంతరం వెంకటాపురం-13 కేంద్రంలో మునగ మొక్కను నాటారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్ వైజర్ టి.జోషి, ఇన్‌చార్జి హెచ్‌ఎం సరళ, ఎంఎల్‌హెచ్‌వీ నాగలక్ష్మి, జీఎంఎస్‌కే టి.లావణ్య, ఏఎన్‌ఎం బి.సుమతి, ప్రజాప్రతినిధులు ఎంయేసు, ఎస్ సతీష్, సీహెచ్ వెంకట్రావు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పెదవేగి సీఐగా వెంకటేశ్వరరావు బాధ్యతల స్వీకరణ



పెదవేగి సీఐ కె.వెంకటేశ్వరరావు

పెదవేగి : పెదవేగి సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా కె వెంకటేశ్వరరావు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన గతంలో పెదవేగి సబ్‌ఇన్‌స్పెక్టర్‌గా విశేష సేవలందించారు. నేడు సర్కిల్ ఆఫీసర్ స్థాయిలో బాధ్యతలు చేపట్టడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.